క్లుప్తంగా

చింతపల్లి ఎస్‌ఐ సతీష్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ


సతీష్‌రెడ్డి, ఎస్‌ఐ

చింతపల్లి: మండల నూతన ఎస్‌ఐ డి. సతీష్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన బాలకృష్ణ సూర్యాపేట జిల్లా మఠంపల్లికి బదిలీ కాగా.. ఆయన స్థానంలో మునుగోడులో ఎస్‌ఐగా పనిచేస్తున్న సతీష్‌రెడ్డి చింతపల్లికి వచ్చారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని నూతన ఎస్‌ఐ హెచ్చరించారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

అనాథ పిల్లలకు సైకిళ్లు బహూకరణ


అనాథ పిల్లలకు సైకిళ్లు బహూకరిస్తున్న వన్ టౌన్ ఎస్‌ఐ శ్రీనునాయక్

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని బాపూజీనగర్ శివారులో గల ఫెయిత్ బంజారా అనాథ ఆశ్రమంలోని పిల్లలకు హైదరాబాద్‌కు చెందిన యుగేందర్ సోమవారం నాలుగు సైకిళ్లను మిర్యాలగూడ వన్ టౌన్ ఎస్‌ఐ శ్రీనునాయక్ చేతుల మీదుగా అందజేశారు. జూన్ 3న ప్రపంచ సైకిళ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని అనాథ పిల్లలకు సైకిళ్లు అందించడం అభినందనీయమని ఎస్‌ఐ శ్రీనునాయక్ అన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు ధీరావత్ హన్యానాయక్, సైదులు, పండు, అమృత, మీనా, ఎలిజబెత్ రాణి, ప్రకాశ్ తదితరులున్నారు.

విజేతకు సన్మానం


ముకేశ్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ రేఖ దంపతులు

కొండమల్లేపల్లి: సీఎం కప్ క్రీడా పోటీల్లో భాగంగా హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో రజత పతకం సాధించిన కొండమల్లేపల్లి మండలంలోని కొల్‌ముంతలపహాడ్ గ్రామానికి చెందిన ముదిగొండ ముకేశ్‌ను సోమవారం ఎంపీపీ దూదిపాల రేఖాశ్రీధర్‌రెడ్డి శాలువాతో సన్మానించారు. బాక్సింగ్‌లో నైపుణ్యాలు మెరుగుపర్చుకునేందుకు ముకేశ్‌ను ఆర్థికంగా బాసటగా నిలుస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాసర్ల వెంకటేశ్వర్లు, భాస్కర్, మహేందర్, సేవానాయక్, ఖదీర్, కార్తీక్, నాగేంద్ర, రమేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సొంత ఖర్చుతో నూతన గృహ నిర్మాణం

కొండమల్లేపల్లి మండలంలోని కొర్రతండాకు చెందిన కొర్ర బాలు, మంగ్లీ దంపతులు ఇల్లు లేక ఇబ్బందులు పడుతుండడంతో తన సొంత ఖర్చుతో వారికి నూతన గృహాన్ని నిర్మించి ఇచ్చేందుకు ఎంపీపీ దూదిపాల రేఖాశ్రీధర్‌రెడ్డి ముందుకొచ్చారు. ఈ మేరకు నూతన గృహ నిర్మాణానికి ఎంపీపీ సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లచ్చిరాం నాయక్, పాండునాయక్, మంగ్యానాయక్, సేవానాయక్, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

రెజ్లర్లకు మద్దతుగా ర్యాలీ

మిర్యాలగూడ టౌన్: తమకు న్యాయం చేయాలని దేశ రాజధాని ఢిల్లీలో మహిళా రెజ్లర్లు చేస్తున్న పోరాటానికి మద్దతుగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం మిర్యాలగూడ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా భారత్ బచావో మిర్యాలగూడ అధ్యక్షుడు సత్యనారాయణరావు, జిల్లా అధ్యక్షురాలు ఉదయ మాట్లాడుతూ.. మహిళా రెజ్లర్ల పట్ల భారత రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపులకు పాల్పడటం సిగ్గుచేటని అన్నారు. కార్యక్రమంలో డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య, సీనియర్ జర్నలిస్టు ఖాజా హమీదొద్దీన్, వెంకులు, రామయ్య, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి జాడి రాజు, భిక్షమయ్య తదితరులున్నారు.

డీఈఓకు వినతి

నల్లగొండ: గుర్రంపోడు మండల కేంద్రంలోని గౌతమి ఇంగ్లిష్ మీడియం స్కూల్ యాజమాన్యం కేవలం 7వ తరగతి వరకు మాత్రమే ప్రభుత్వం అనుమతి పొంది ఈ విద్యా సంవత్సరం పదో తరగతి విద్యార్థులను చేర్చుకుంటున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండలో డీఈఓ భిక్షపతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ.. రేకుల గదుల్లో తరగతులు నిర్వహిస్తుండడంతో పాటు ఆటస్థలం, లేకున్నప్పటికీ ఎంఈఓ అనుమతి కోసం జిల్లా అధికారులకు పంపించారని ఆరోపించారు. 7వ తరగతి వరకు రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు ఉంటే సీబీఎస్‌ఈ విధానంలో విద్యాబోధన చేస్తామంటూ ప్రచారం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆవుల సంపత్‌కుమార్, పట్టణాధ్యక్షుడు హేమంత్, బెల్లంకొండ వినయ్, చాడ వేణు, జక్కల సందీప్ తదితరులు ఉన్నారు. అదేవిధంగా ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో డీఈఓకు వినతిపత్రం అందజేశారు.

అధ్వానంగా నల్లగొండ-దేవరకొండ రోడ్డు

- ఎనిమిది సార్లు టెండర్లు పిలిచినా ముందుకురాని కాంట్రాక్టర్లు
- గుంతల రహదారితో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు


ఆమలూరు స్టేజీ వద్ద దెబ్బతిన్న నల్లగొండ-దేవరకొండ ప్రధాన రహదారి


కట్టవారిగూడెం గ్రామ స్టేజీ వద్ద ఇదీ రోడ్డు దుస్థితి..

గుర్రంపోడు: ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైనా పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాక గుర్రంపోడు మండల పరిధిలోని రోడ్లు అధ్వానంగా మారాయి. మండలంలో ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో 26 కిలోమీటర్ల మేర ఉన్న నల్లగొండ-దేవరకొండ ప్రధాన రహదారి అడుగడుగునా గుంతలమయంగా మారింది. మహబూబ్‌నగర్-నల్లగొండను కలిపే ఈ రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించాలనే ప్రతిపాదనకు మోక్షం లభించడం లేదు. తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండల పరిధిలో 57 కిలోమీటర్ల ఆర్‌అండ్‌బీ శాఖ రహదారులు కొన్ని టెండర్ల దశలో, మరికొన్ని మంజూరుకు ఎస్టిమేషన్ల దశలో ఉన్నాయి.

ఎనిమిది సార్లు టెండర్లు పిలిచినా..

నల్లగొండ-దేవరకొండ ప్రధాన రహదారిపై గుర్రంపోడు నుంచి పాల్వాయి వరకు రూ.6.30 కోట్లతో రహదారి నిర్మించేందుకు ఎనిమిది సార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకురాలేదు. పెరిగిన ధరలకు అనుగుణంగా అంచనాలు లేవని, గతంలో చేసిన పనులకే బిల్లులు రాక పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకురావడం లేదని తెలుస్తుంది. గుర్రంపోడు నుంచి ముక్కాముల వరకు 13 కిలోమీటర్ల దూరం బీటీ రెన్యూవల్‌కు రూ.2.43 కోట్లతో ఆరుసార్లు టెండర్లు పిలిచినా ఒక్క టెండరు కూడా నమోదు కాలేదు. గుర్రంపోడు- మల్రిగూడెం రోడ్డులో మండలకేంద్రం నుంచి నాంపల్లి రోడ్డులో రెండు కిలోమీటర్ల దూరం ఇరువైపులా మురుగు కాల్వల నిర్మాణానికి రూ.1.73 కోట్లతో ప్రతిపాదనలు పంపినా నిధుల మంజూరు లభించలేదు. గుర్రంపోడు- చండూరు మధ్య కస్తాల వరకు పది కిలోమీటర్ల బీటీ రోడ్డుకు రూ.రెండు కోట్లతో టెండర్లు పూర్తయినా కాంట్రాక్టర్ ఏడాది కాలంగా పనులు ప్రారంభించడం లేదు.

టెండర్లు పిలుస్తున్నాం

కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో రోడ్డు నిర్మాణ పనులు ఆలస్యమవుతున్నాయి. వెంటవెంటనే టెండర్లు పిలుస్తున్నాం. తాత్కాలికంగా వార్షిక మరమ్మతులు, రోడ్ సేఫ్టీ పనులు చేపడుతున్నాం. కనగల్ నుంచి గుర్రంపోడు వరకు బీటీ రోడ్డుపై ప్యాచ్‌వర్క్ పనులు త్వరలో చేపడతాం.

\- అనిత, ఆర్‌అండ్‌బీ ఏఈ

దేశానికే వెలుగులు నింపే స్థాయికి తెలంగాణ

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి


హాలియా: మాట్లాడుతున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే భగత్ తదితరులు

హాలియా: గత తొమ్మిదేళ్లలో విద్యుత్ రంగంలో తెలంగాణ రాష్ట్రం గణనీయమైన అభివృద్ధి సాధించి దేశానికే వెలుగులు నింపే స్థాయికి చేరుకుందని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం హాలియాలోని లక్ష్మీనరసింహ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రగతి విజయోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యుత్ రంగంలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టి ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసే విషయంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారన్నారు. నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ మాట్లాడుతూ.. దేశంలోనే రైతులకు ఉచితంగా 24 గంటల విద్యుత్ ఇస్తున్న రాష్ట్రం ఒక్క తెలంగాణ మాత్రమేనన్నారు. అనంతరం ఎమ్మెల్యే భగత్ విద్యుత్ ఉద్యోగులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మృతిచెందిన ఐదుగురు రైతుల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ట్రికార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్, జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, ఆప్కాబ్ మాజీ చైర్మన్ యడవెల్లి విజయేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు జవ్వాజి వెంకటేశ్వర్లు, మర్ల చంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంపటి పార్వతమ్మశంకరయ్య, ఎంపీపీ బొల్లం జయమ్మ, జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులడు కర్ణ బ్రహ్మారెడ్డి, పీడీ రాజ్‌కుమార్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షులు తదితరులుపాల్గొన్నారు.

మానసిక ప్రశాంతతకు నిలయాలు

పెద్దవూర: దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం పెద్దవూర మండలంలోని పోతునూరు గ్రామంలో శ్రీసీతారామచంద్రస్వామి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవంలో నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం గ్రామస్తులు శాలువాలు, పూలమాలలతో వారిని సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గుంటుక వెంకట్‌రెడ్డి, నాయకులు కర్ణ బ్రహ్మారెడ్డి, బోయ నరేందర్‌రెడ్డి, దేవాలయ చైర్మన్ గుండెబోయిన శ్రీనివాస్, ఎంపీటీసీ తరి లక్ష్మమ్మవెంకటయ్య, పొదిళ్ల శ్రీనివాస్, మెండె సైదులుయాదవ్, పెండ్యాల లక్ష్మీ, కొండల్‌రావు, జంగయ్య తదితరులు ఉన్నారు.

24గంటల విద్యుత్ ఘనత సీఎం కేసీఆర్‌దే

- ఎమ్మెల్యే రవీంద్రకుమార్


దేవరకొండ: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ: తెలంగాణ రాష్ట్రంలో అన్ని రంగాలకు 24గంటల విద్యుత్ అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దే అని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం దేవరకొండ పట్టణంలోని సాయిరమ్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన తెలంగాణ విద్యుత్ ప్రగతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గడిచిన 60 ఏళ్లలో ఏ ఒక్క ప్రభుత్వం విద్యుత్ సమస్యను పరిష్కరించలేకపోయిందన్నారు. సమైక్య పాలకులు తెలంగాణ వస్తే రాష్ట్రం అంధకారం అవుతుందని ఎద్దేవా చేశారని, కానీ వారి అంచనాలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం తలకిందులు చేసిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ గోపీరాం, ఎంపీపీలు మాధవరం సునీత, వంగాల ప్రతాప్‌రెడ్డి, పద్మ, దూదిపాల రేఖారెడ్డి, జెడ్పీటీసీ కంకణాల ప్రవీణ, కేతావత్ బాలునాయక్, వల్లపురెడ్డి, ఉజ్జిని విద్యాసాగర్‌రావు, కేసాని లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత..

చింతపల్లి: దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే రవీంద్రకుమార్ అన్నారు. సోమవారం చింతపల్లి మండల పరిధిలోని ఉప్పరపల్లిలో నిర్వహించిన శ్రీలింగమంతుల స్వామి, పెద్దమ్మ తల్లి పండుగకు ఎమ్మెల్యే హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, జెడ్పీటీసీ కంకణాల ప్రవీణ, సర్పంచ్ ఉజ్జిని లక్ష్మణ్‌రావు, వెంకట్‌రెడ్డి, గున్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, విద్యాసాగర్‌రావు, వింజమూరు రవి, నర్సింహారావు, నిర్మల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నివాళి..

చింతపల్లి మండల పరిధిలోని పాలెంతండా బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నేనావత్ రాము తల్లి నేనావత్ కోమటి సోమవారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ సోమవారం పాలెంతండాకు చేరుకుని కోమటి మృతదేహానికి నివాళులర్పించి ఆమె కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు కొండల్‌నాయక్, ఉడుతల అక్రం, చందర్‌నాయక్, కుంభం శ్రీశైలం, మంగ్యానాయక్, బిచ్చానాయక్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

సీతారామచంద్రస్వామి ఆలయంలో ఎమ్మెల్సీ పూజలు


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

పెద్దవూర: మండలంలోని పోతునూరు గ్రామంలో సోమవారం శ్రీసీతారామచంద్ర స్వామి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నాయినివానికుంట గ్రామంలో గంగమ్మతల్లి జాతరలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్సీని సన్మానించి, జ్ఞాపికను అందించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మన్నెం రంజిత్‌యాదవ్, గురువయ్యయాదవ్, ఆలయ చైర్మన్ గునబోయిన శ్రీనివాస్, కొండల్‌రావు, నడ్డి లింగయ్య, పొదిళ్ల శ్రీనివాస్, చంద్రయ్య, కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.50వేల విరాళం

పోతునూరు గ్రామంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో సోమవారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయానికి తన వంతుగా రూ.50వేల విరాళం అందించారు. అదేవిధంగా అనారోగ్యంతో బాధపడుతున్న నాయినవానికుంట గ్రామానికి చెందిన మేకల లక్ష్మయ్య, కత్తి గోవిందరెడ్డికి రూ.5వేల చొప్పున ఆర్థికసాయం అందించారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన గంగమ్మతల్లి జాతరలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్ను అనురాధా సుందర్‌రెడ్డి, తిరుమలగిరి వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్‌రెడ్డి, సర్పంచ్‌లు నడ్డి లింగయ్య, ప్రభావతిసంజీవరెడ్డి, జనార్దన్‌రెడ్డి, ఉప సర్పంచ్ మట్టపల్లి ప్రదీప్‌రెడ్డి, నాయకులు వినయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

- ఎమ్మెల్యే నోముల భగత్


హజారిగూడెం ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నోముల భగత్

హాలియా: ప్రతిఒక్కరూ ఆధ్మాత్మిక చింతన అలవర్చుకోవాలని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. హాలియా మండలంలోని హజారిగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో సోమవారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దాతల సహకారంతో ఆలయ నిర్మాణం చేపట్టడం అభినందనీయమన్నారు. అనంతరం ఎమ్మెల్యే భగత్‌ను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. అదేవిధంగా ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందజేసిన బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పాండురంగారెడ్డిని శాలువాతో సత్కరించారు.

రూ.4,11,116 విరాళం..

శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున ఆలయంలో నిత్యం దూప దీప నైవేద్యానికి గాను చేగొండి లక్ష్మమ్మ, సత్తయ్య దంపతుల కుమారులు డాక్టర్ చేగొండి మధురాధర్(అమెరికా) చేగొండి నాగార్జున (ఇంటలిజెన్స్ డీఎస్పీ), డాక్టర్ చేగొండి రంజిత్‌కుమార్(న్యూరో సర్జన్) రూ.4,11,116 విరాళం అందజేశారు. అదేవిధంగా హాలియా టైం స్కూల్ డైరెక్టర్లు మంద నరేందర్‌రెడ్డి, కోటిరెడ్డి, నర్సిరెడ్డి ఆధ్వర్యంలో 8వేల మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, ఆప్కాబ్ మాజీ చైర్మన్ యడవెల్లి విజయేందర్‌రెడ్డి, ఎస్‌ఆర్‌ఐ కొంపెల్లి శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ వద్దిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పెద్దవూర ఎంపీపీ చెన్ను అనురాధసుందర్‌రెడ్డి, తిరుమలగిరి వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్‌రెడ్డి, అనుముల మండల బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి యనమల సత్యం, హజారిగూడెం ఉప సర్పంచ్ షేక్ జబీన్ జలీల్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రతిష్ఠాపనోత్సవాలు


దుర్గాదేవి ఆలయంలో పూజలు చేస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే భాస్కర్‌రావు

వేములపల్లి: మాడ్గులపల్లి మండలంలోని గుర్రప్పగూడెంలో నూతనంగా నిర్మించిన దుర్గాదేవి ఆలయంలో సోమవారం నిర్వహించిన అమ్మవారి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ ఫ్లోర్ లీడర్ పాశం రాంరెడ్డి, సర్పంచ్ కర్ర వనమ్మ, ఇంద్రారెడ్డి, అంజన్‌కుమార్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఎల్‌ఆర్ ప్రత్యేక పూజలు..

దుర్గాదేవి ఆలయంలో విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవంలో మిర్యాలగూడ కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బత్తుల లక్ష్మారెడ్డి(బీఎల్‌ఆర్) పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బలగం సినిమా నటుడికి సత్కారం


మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌లో కర్తానందంను సత్కరిస్తున్న డీఎం పాల్ తదితరులు

మిర్యాలగూడ టౌన్: కోదాడ నుంచి మిర్యాలగూడ మీదుగా సోమవారం ఆర్టీసీ బస్సులో హైదరాబాద్‌కు వెళ్తున్న బలగం సినిమా నటుడు కర్తనందం కొద్దిసేపు మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌లో సందడి చేశారు. కర్తానందం వచ్చిన విషయం తెలుసుకున్న డిపో మేనేజర్ బొల్లెద్దు పాల్ ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది జనార్దన్ తదితరులున్నారు.

హజ్ యాత్రికులకు వీడ్కోలు

మిర్యాలగూడ: మిర్యాలగూడ నుంచి సోమవారం హజ్ యాత్రకు వెళ్తున్న వారికి స్థానిక హజ్ సొసైటీ ఆధ్వర్యంలో మస్జిద్ ఆర్భాత్‌లో వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వారిని సత్కరించారు. అనంతరం మౌలానా మహమ్మద్ వలీయుల్లా, ముఫ్తీ మహమ్మద్ ఇమ్రాన్ మాట్లాడుతూ.. సహనంతో, ఓపికతో హజ్ యాత్రను విజయవంతం ముగించుకొని రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి అర్షద్‌ఖాన్, బాధ్యులు ఎండీ ఇస్మాయిల్, ఎండీ వాజిద్, యాత్రికులు ఎంఏ బేగ్, ఎండీ అన్వర్, ఎంఏ బారి, ఎండీ ఖదీరుద్దిన్, ఫహీమొద్దీన్, మతిన్, మస్జిద్ కమిటీ అధ్యక్షుడు ఎండీ ఫసిజుద్దీన్, నాత్‌ఖాన్, అబ్దుల్ అజీజ్ పాల్గొన్నారు.

ఆశ వర్కర్లకు పరీక్షను రద్దు చేయాలి

మిర్యాలగూడ: రాష్ట్ర ప్రభుత్వం ఆశ వర్కర్ల పనితీరును అంచనా వేసేందుకు నిర్వహించనున్న పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దామరచర్ల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట సోమవారం ఆశ వర్కర్లు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి దయానంద్ మాట్లాడుతూ. ఆశలకు నిర్వహించే పరీక్షను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.18వేలు అందించాలని, 32రకాల రిజిస్టర్‌లను ప్రభుత్వం కొనుగోలు చేసి ఇవ్వాలని, ఆరోగ్య బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యుడికి వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మాలోతు వినోద్‌నాయక్, పాపానాయక్, శ్రీనునాయక్, ఎస్‌కే సుభానీ, ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జయమ్మ, పద్మ, కవిత, శ్రీలక్ష్మీ, ఇందిరా, చంద్రకళ, సంతోష, సావిత్రి, రమాదేవి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

వేములపల్లి: మండలంలోని రావులపెంటలో గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో గంగమ్మతల్లి విగ్రహంతో పాటు లింగమంతులస్వామి, చౌడమ్మ విగ్రహాలను సైతం ప్రతిష్ఠింపజేశారు. ఎస్‌బీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దొంతిరెడ్డి వెంకట్‌రెడ్డి, పెద్దగొల్ల ముక్త అమ్మయ్య, జంగిలి ఎల్లయ్య, ఉప సర్పంచ్ తరి సైదులు పాల్గొన్నారు.

కార్పొరేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు


హాలియా: రామడుగు గ్రామంలో బడిబాట ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు


మిర్యాలగూడ టౌన్: గాంధీనగర్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

గుర్రంపోడు: ప్రభుత్వం మన ఊరు-మన బడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ బడులను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతుందని గుర్రంపోడు మండల విద్యాధికారి తరి రాము అన్నారు. సోమవారం గుర్రంపోడు మండలంలోని మొసంగి, చేపూరు గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్ నమోదు, విలేజ్ ఎడ్యుకేషన్ రిజిస్టర్ అప్‌డేటేషన్‌ను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి బడీడు పిల్లల వివరాలను తెలుసుకున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

పెద్దవూర: ప్రభుత్వ పాఠశాలల్లోనే నిష్ణాతులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య లభిస్తుందని పెద్దవూర స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం కె. శ్రీనివాస్ అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం పెద్దవూర మండల కేంద్రంతో పాటు సంగారం, పిన్నవూర గ్రామాలలో ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీచర్లు శైలజ, రామ్మోహన్, శ్రీనివాస్, పద్మ, శంకర్, కరుణాకర్ పాల్గొన్నారు.

బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

మిర్యాలగూడ టౌన్: బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొర్ర కృష్ణకాంత్‌నాయక్ అన్నారు. సోమవారం మిర్యాలగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీనగర్‌లో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ. నర్సిరెడ్డి, ఉపాధ్యాయులు లాలోజి, సునిత, శ్రీకాంత్, అశ్విని, సభిహా, సుల్తానా తదితరులున్నారు.

కొనసాగుతున్న బడిబాట

హాలియా: మండలంలోని చింతగూడెం జిల్లా పరిషత్ పాఠశాల ఆధ్వర్యంలో సోమవారం రామడుగు గ్రామంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్లు రామచంద్రయ్య, వీరయ్య పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సదుపాయాలతో పాటు నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. కార్యక్రమంలో చింతగూడెం జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు అబ్బిరెడ్డి వేమారెడ్డి, ఉపాధ్యాయుల గడ్డం శ్యాంప్రసాద్, ఎండీ పాషా, పురం వెంకటయ్య, సాగర్ల సత్తయ్య, దూసరి మధు, ఈగల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరిలో..

తిరుమలగిరి(నాగార్జునసాగర్): హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు సోమవారం తిరుమలగిరి మండలంలోని రంగుండ్ల గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ కళాలలో చేరాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఆదిరెడ్డి, వెంకటేశ్వర్‌నాయక్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

జీవ మనుగడకు పర్యావరణం ముఖ్యం


మిర్యాలగూడ అర్బన్: కేఎస్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటుతున్న అధ్యాపకులు


దేవరకొండ: ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటుతున్న అధ్యాపకులు

మిర్యాలగూడ అర్బన్: భూమిపై మానవాళితో పాటు ఇతర జీవుల మనుగడకు పర్యావరణ పరిరక్షణ ఎంతో ముఖ్యమని మిర్యాలగూడ పట్టణంలోని కేఎస్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భిక్షమయ్యగౌడ్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం కళాశాలలో అధ్యాపకులతో కలిసి ఆయన మొక్కలు నాటి మాట్లాడారు. పర్యావరణాన్ని కాపాడుకోవలసిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు నర్సింగ్ కోటయ్య, నరేందర్‌రెడ్డి, నరేష్, స్వప్న, నాగరేఖ, రాణి, హేమ, రమేష్, శ్రీనివాసచారి, కవిత, యాదమ్మ, కవిత, సరోజ, శ్రీలత తదితరులున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

దేవరకొండ: పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని చర్లపల్లిలో గల డీవీఎం కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ వైస్ ప్రిన్సిపాల్ డి. రామకృష్ణ అన్నారు. సోమవారం దేవరకొండలోని ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామరాజు, బాల, లింగారెడ్డి, కోటయ్య, లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆర్థికసాయం అందజేత

డిండి: మండల కేంద్రానికి చెందిన గుడి మల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా సోమవారం శివపార్వతి ముదిరాజ్ సంఘం, డిండి ఆధ్వర్యంలో మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.15వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పోలం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బల్మూల ప్రేమ్‌కుమార్, తవిటి సుధాకర్, కటికర్ల శ్రీను, గుడి రాములు తదితరులు పాల్గొన్నారు.

మిల్లులకు 89,238 క్వింటాళ్ల ధాన్యం

కొండమల్లేపల్లి: మండలంలోని చింతకుంట్ల, పెండ్లిపాకల, చిన్నఅడిశర్లపల్లి, గుమ్మడవెల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ఇప్పటివరకు 1,577మంది రైతుల నుంచి 89,238 క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించి మిల్లులకు తరలించినట్లు కొండమల్లేపల్లి పీఏసీఎస్ సీఈఓ తిరుపతిరెడ్డి సోమవారం విలేకరులకు వెల్లడించారు. సాధ్యమైనంత త్వరగా రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించి మిల్లులకు తరలించినట్లు పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్‌రెడ్డి పేర్కొన్నారు.

గుర్తింపు లేని పాఠశాలలను రద్దు చేయాలి

మిర్యాలగూడ అర్బన్: గుర్తింపు లేని పాఠశాలలను రద్దు చేయాలని ఎస్‌ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రూపావత్ హరిప్రసాద్ అన్నారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లలో పెండింగ్‌లో ఉన్న మెస్ చార్జీ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా గుర్తింపు లేని పాఠశాలలతో పాటు అధిక ఫీజులు వసూలు చేసే స్కూళ్లను మూసివేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఎంఏ ఆరీఫ్, నాయకులు శివ, పవన్ తదితరులున్నారు.

కబీర్‌దాస్ జయంతి వేడుకలు

దేవరకొండ: ప్రజా సంఘాల జేఏసీ దేవరకొండ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కబీర్‌దాస్ జయంతి వేడుకలను సోమవారం దేవరకొండలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దేవరకొండ మున్సిపల్ వైస్ చైర్మన్ రాహత్ అలీ హాజరై కబీర్‌దాస్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కంబాలపల్లి వెంకటయ్య, చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్, తౌఫిక్, పొట్ట మురళి, ఎర్ర ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

మిర్యాలగూడ అర్బన్: ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించే ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని ఎంఈఓ బాలాజీనాయక్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఫిర్యాదులు అందుతున్నాయని, అట్టి పాఠశాలలను గుర్తించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు ఇస్తున్నామని, ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పుస్తకాలు అమ్మేందుకు గాను మిర్యాలగూడ పట్టణంలోని కొన్ని బుక్‌స్టాళ్లకు అనుమతి ఇచ్చామని పేర్కొన్నారు. జూన్ 12 నుంచి తరగతులు నిర్వహించాలని, ప్రైవేటు పాఠశాలల్లోని నోటీస్ బోర్డులపై ఫీజుల వివరాలు ప్రదర్శించాలని పేర్కొన్నారు.